సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 21 । డిసెంబర్ । 2024



నిబంధనలు బేఖాతర్..!
నిబంధనలు తుంగలో తొక్కి మద్యం దుకాణాలకు అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు.
-8లో



దళిత సంక్షేమ పథకాలను అమలు చేయాలి
దళితుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు.
-8లో

గరిష్టం/కనిష్టం
30.6/23.8

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 23.8 – 30.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాకు ప్రథమస్థానం

కడప అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ సంస్థ వ్యవసాయంలో ఇచ్చిన ర్యాంకింగ్స్‌లో మన జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన బ్లాక్‌ల అభివృద్ధి కోసం ఉద్దేశించి ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం 2018లో భాగంగా జిల్లాలోని చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాలను ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా ఈ మండలాలలో వ్యవసాయం, నీటి వనరుల కింద సూక్ష్మ నీటి సేద్యం, భూగర్భ జలాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు, పంటల బీమా, దిగుబడి పెంచడం, మద్దతు ధర, పశువుల సంరక్షణ, మట్టి నమూనా పరీక్షలు వంటి వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారని తెలిపారు. ఈ ఇతి వృత్తాలలో 2018 నుంచి 2024 వరకు జరిగిన పురోగతిని నీతి ఆయోగ్ సంస్థ పర్యవేక్షించి జిల్లాల వారిగా, ఇతి వృత్తాల వారిగా ర్యాంకింగ్స్ ఇచ్చిందన్నారు. ఆ జాబితాలో వ్యవసాయంలో జిల్లాకు ప్రథమ స్థానం లభించిందని నాగేశ్వరరావు తెలిపారు.

నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్



వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, చిన్మయ మిషన్ అధ్యక్షులు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణా నిపుణులు ఎం.నాగూర్ బాబు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులు సాగిస్తూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

నేడు 37 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి శనివారం 37 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని యం.నరసింహాపురం, జి.నరసింహాపురం, వెంకటశెట్టిపల్లి, బ్రాహ్మణపల్లి, వనిపెంట, టి. సళ్లగిరిగెళ్ళ, ఓబుళాపురంలో నిర్వహించనున్నామన్నారు. అలాగే పులివెందుల రెవెన్యూ డివిజన్ లోని చక్రాయపేట మండలం కుప్పం, లింగాల, కొర్రపాడు, రావులకొలను, ఉడవగండ్ల, వేంపల్లె-4-5 సచివాలయాలు, వేముల మండలం వేల్పుల, వీఎన్ పల్లి మండలంలో పాయసంపల్లి, తలపనూరు, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ లోని చాపాడు మండలం వెంగన్నగారిపల్లె, దువ్వూరు మండలం మాచనపల్లె, జమ్మలమడుగు మండలం గండికోట, కొండాపురం మండలంలో అనంతపురం, పెంజువ్వి, ముద్దనూరు, మైలవరం, ఖాదరాబాద్, పెద్దముడియం మండలం నెమ్మళ్లదిన్నె, ఉప్పలూరు, ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె, రాజుపాలెం మండలం వాసుదేవపురం, ఎర్రగుంట్ల మండలం చిలమకూరు, కడప డివిజన్ లోని సి కె దిన్నె మండలం ఊటుకూరు, కమలాపురం మండలం దాదిరెడ్డిపల్లె, ఖాజీపేట మండలం దుంపలగట్టు, పెండ్లిమర్రి మండలం వెల్లటూరు, సిద్దవటం మండలం జంగాలపల్లి, వెలుగుపల్లి, వల్లూరు మండలం తోలగంగన్నపల్లి, ఒంటిమిట్ట మండలం జౌకులపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

సర్టిఫికెట్ల అందజేత



మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో న్యాయమూర్తులు, రీసోర్స్‌పర్సన్‌లు

కడప అర్బన్: కడపలోని న్యాయ సేవా సదన్‌లో, కడప న్యాయవాదుల సంఘం భవనంలో, న్యాయమూర్తి ఛాంబర్‌లో 'మధ్యవర్తిత్వం' అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించారు. న్యాయవాదులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ చైర్మన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్‌ల సూచనల మేరకు రీసోర్స్ పర్సన్‌లు బీనా దేవరాజ్, డాక్టర్ ఎస్. పద్మ శిక్షణ కార్యక్రమాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించారు.

నాడు విద్యా విప్లవం.. నేడు నిర్వీర్యం

- 8వ తరగతి నుంచే సాంకేతిక ఉన్నతికి ట్యాబులు పంపిణీ
- ఆంగ్ల బోధన అమలుతో విప్లవాత్మక మార్పులు
- ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దిన వైనం
- వైఎస్ జగన్ హయాంలో పేద విద్యార్థులకు వెన్నుదన్ను
- కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం
- తల్లికి వందనం కాదు... పంగనామాలు పెట్టిన చంద్రబాబు సర్కార్



బైజూస్ ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: పేద విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో మెరుగైన విద్య అందించాలనే సంకల్పం ఆయనది. చదువుతోనే దారిద్ర్యం పోతుందని మనసా వాచా నమ్మారు. ఆమేరకు చేపట్టాల్సిన అన్ని చర్యలను క్రమం తప్పకుండా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చారు. పాఠశాలల రూపురేఖలు మారుస్తూ మౌళిక వసతులు సమకూర్చేందుకు శ్రీకారం చుట్టారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే తలంపుతో తల్లిదండ్రులను ప్రోత్సహించారు. అమ్మఒడి పథకం ద్వారా బాసటగా నిలిచారు. ప్రవేటు విద్యా వ్యవస్థ మోజు నుంచి గ్రామీణుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు మళ్లించారు. అందుకోసం అవసరమైన ఆంగ్ల విద్యాబోధన ప్రవేశపెట్టారు. ఆపై సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. వసతి దీవెన, విద్యా దీవెన పేరిట ఎప్పటికప్పుడు విద్యార్థులకందిస్తూ వారి తలరాతలను మార్చేందుకు కృషి చేశారు. ఇదంతా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగింది. విద్యారంగంలో విప్లవం తీసుకొచ్చిన జగనన్న పాలన ఆదర్శంగా నిలిచింది. అయితే ఇప్పుడు చంద్రబాబు పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం దిశగా పయనిస్తోంది. కాగా జగన్ అధికారంలో ఉన్నింటే డిసెంబర్ 21న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేసేవారని ప్రజలు చర్చించుకుంటున్నారు. క్రమం తప్పకుండా రెండేళ్లు పంపిణీ చేశారని గుర్తు చేసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా అర్హులైన విద్యార్థులు 15 వేల మందిపైగానే ఉన్నారు. జగనన్న పుట్టిన రోజున ఆనందంగా విద్యార్థులు ట్యాబులు స్వీకరించేవారు. కూటమి సర్కార్ ట్యాబులు పంపిణీకి మంగళం పలికింది. జగనన్న పాలనలో క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకం కింద తల్లుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేవి. ఇప్పుడు తల్లికి వందనం మాటేమో కానీ, చంద్రబాబు సర్కార్ విద్యార్థుల తల్లులకు పంగనామాలు పెట్టిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.



నాడు–నేడుతో కళకళలాడిన పాఠశాలలు

స్వాతంత్ర్యం నాటి నుంచి ఉన్న పాఠశాలలు సైతం ఎదుగూబొదుగూ లేకుండా ఉండేవి. పాఠశాలల్లో మౌళిక వసతులు సమకూర్చేందుకు వైఎస్ జగన్ సర్కార్ విశేషంగా కృషి చేసింది. పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. అదనపు తరగతి గదులు వచ్చేశాయి. పూర్వ విద్యార్థులు మేము చదువుకున్న పాఠశాలేనా అని ఆశ్చర్య చకితులయ్యేలా తీర్చిదిద్దారు.

- జిల్లాలో తొలివిడతలో రూ.275 కోట్లతో 1,040 పాఠశాలలను ఆధునాతనంగా రూపొందించారు. రెండో విడతలో మరో రూ.306 కోట్లతో 1,006 పాఠశాలలకు కావాల్సిన సదుపాయాలు కల్పించారు. కూర్చొనేందుకు ఆకర్షనీయమైన టేబుళ్లు, డిజిటల్ బోర్డులు ఇలా క్రమం తప్పకుండా అన్ని హంగులు సమకూరాయి. విద్యార్థులు ఆరుబయట మలమూత్రాలు విసర్జించే సంస్కృతికి ఫుల్‌స్టాప్ పడింది. అన్ని వసతులు సమకూర్చడంతోపాటు స్కూల్ బ్యాగులు, బూట్లు, యూనిఫాం సైతం అందించి చదువులపై విద్యార్థులకు మక్కువ పెరిగేలా చర్యలు చేపట్టారని పలువురు వివరిస్తున్నారు.

అమ్మ ఒడితో ప్రోత్సాహం...

విద్యార్థులను పాఠశాలలకు పంపించేందుకు తల్లులను వైఎస్ జగన్ సర్కార్ ప్రోత్సహించేది. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15వేలు చొప్పున క్రమం తప్పకుండా అందించేవారు. అలా జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లు లభించింది. తల్లుల ఖాతాలకు నేరుగా రూ.1,347.4కోట్లు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేశారు.

- తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరిట ఎంతమంది ఉంటే అంత మంది పిల్లలకు అందిస్తామని ఎన్డీయే కూటమి ఎన్నికలకు ముందు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం లేకపోగా, ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. వెరశి తల్లులకు పంగనామాలు పెట్టారనే ఆరోపణలను చంద్రబాబు సర్కార్ మూటగట్టుకుంది.
- విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకవచ్చి చదువే అతిపెద్ద ఆస్తి అన్నట్లుగా వైఎస్ జగన్ సర్కార్ వ్యవహరిస్తే, చంద్రబాబు సర్కార్ ప్రభుత్వ విద్యా వ్యవస్థను దిగజార్చే చర్యలకు ఉపక్రమించిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

విద్యా సంవత్సరం	మంజూరైన ట్యాబులు	విద్యార్థులకు పంపిణీ
2022–23	19,699	19,008
2023–24	15,275	15,249

నాడు–నేడు	పాఠశాలలు	నిధులు
తొలి విడత	1,040	రూ.275 కోట్లు
రెండో విడత	1,006	రూ.307 కోట్లు

వైఎస్ జగన్ సర్కార్ హయాంలో....

ప్రభుత్వ పథకం	లబ్ధిదారులు	మొత్తం (కోట్లల్లో)
జగనన్న వసతి దీవెన	1,28,280	రూ.150.38 (డీబీటీ)
జగనన్న విద్యా దీవెన	1,40,934	రూ.378.75 (డీబీటీ)
జగనన్న గోరుముద్ద	1,08,962	రూ.107.95 (నాన్‌డీబీటీ)
జగనన్న విద్యాకానుక	1,11,893	రూ.79.47 (నాన్‌డీబీటీ)
మంజూరైన మొత్తం	–	రూ.716.55 కోట్లు

అమ్మ ఒడి పథకం అమలు	తల్లుల సంఖ్య	జమ చేసిన మొత్తం (కోట్లల్లో)
2019–20 (51మండలాలు)	2,55,587	రూ.383.38
2020–21(51 మండలాలు)	2,68,076	రూ.402.11
2021–22(36 మండలాలు)	1,87,742	రూ.281.61
2022–23(36 మండలాలు)	1,80,203	రూ.270.30
మొత్తం	8,91,608	రూ.1,337.4

మాకు ట్యాబ్‌లు ఇవ్వాలి



మా పాఠశాలలో గతేడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చారు. మాకు ఈ ఏడాది ఇవ్వలేదు. ఇస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాము. ఇస్తే మేము కూడా ట్యాబ్‌లలో చదువుకుంటాం. మాకు ట్యాబులు ఇవ్వాలి.
– హర్షవర్ధన్, 8వ తరగతి విద్యార్థి, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప

సాంకేతిక పరిజ్ఞానం..



ప్రభుత్వం మాకు కూడా ట్యాబ్‌లు ఇస్తే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకుంటాం. గత ఏడాది మా సీనియర్లకు మాత్రం ట్యాబ్‌లను ఇచ్చారు. మా దాకా వచ్చాక ఇవ్వకుండా ఆపేశారు. మాకు కూడా ట్యాబ్‌లను ఇస్తే మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.
– వైష్ణవి, 8వ తరగతి విద్యార్థి, కడప

గత విద్యా విధానాలను కొనసాగించాలి



రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో విద్య పరంగా అమలు చేసిన పథకాలను కొనసాగించాలి. అలాగే పాఠశాలల్లో నాడు–నేడు అసంపూర్తి పనులను పూర్తి చేయాలి. దీంతోపాటు పిల్లలకు ఇంగ్లీష్ మీడియం కొనసాగించడంతోపాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందచేసి వారి అభివృద్ధికి కృషి చేయాలి. అమ్మ ఒడి పథకాన్ని కొనసాగించాలి.
– ఎంవీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

వైఎస్సార్‌సీపీని ముందుండి నడిపించండి



వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను సన్మానిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు ముందుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నడిపించాలని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవులు ఇవ్వడం జరిగిందని, కొత్తగా ఎంపికైన అనుబంధ సంఘాల అధ్యక్షులంతా ఆయా విభాగాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. తద్వారా పార్టీని పటిష్టం చేయడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. సన్మానం పొందిన వారిలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షడ్రక్ రాజు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు ఎం. జాషువా, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు జీవీ రాఘవరెడ్డి, ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు మేసా ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు అహ్మద్‌బాషా, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు వి. రామక్రిష్ణారెడ్డిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సానపురెడ్డి శివకోటిరెడ్డి, లక్ష్మయ్య దాసరి శివప్రసాద్, సుబ్బరాయుడు, సునీత తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ జిల్లా పర్యటన



కడప సెవెన్‌రోడ్స్: కడపలో జరుగుతున్న కేంద్ర పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు జిల్లా పర్యటనకు వస్తున్నారని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం నీతి ఆయోగ్ సీఈఓ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఆకాంక్ష బ్లాకులుగా గుర్తించిన సీకే దిన్నె, జమ్మలమడుగు, పెండ్లిమర్రి మండలాల్లో పర్యటిస్తారని తెలిపారు. క్షేత్ర స్థాయి ప్రగతిని పరిశీలించి సమీక్షిస్తారన్నారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఆర్థిక రాబడులు, స్కిల్ డెవలప్‌మెంట్, కనీసమౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో జిల్లా సాధించిన ప్రగతి నివేదికలను అధికారులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర మంత్రుల రాక

రాష్ట్ర టూరిజం కల్చరల్ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం కడపకు రానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు.

జేఎన్‌టీయూలో జాతీయ సదస్సు



మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, తదితరులు

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్ ఆశ్రయ్–2కె24 జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సదస్సు రెండు రోజులపాటు జరుగుతుందని, సదస్సు ప్రాముఖ్యతను తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా విజ్ఞానం, సాంకేతికతను పెంపొందించుకోవాలని, 3డిమ్యాక్స్–ఆటోక్యాడ్ మీద విద్యార్థులకు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సూర్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వ్యాధుల నివారణకు పటిష్ట ప్రణాళిక

కడప అగ్రికల్చర్: కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పశు సంవర్థశాఖ సమర్థవంతమైన చర్యలను చేపడుతోందని జిల్లా పశు సంవర్థశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఇందుకోసం 2024–25 ఆర్థిక సంవత్సరంలోని నాల్గవ త్రైమాసికంలో చేపట్టవలసిన వైద్య సేవలు, టీకాల కార్యక్రమాలు, ఇతర వైద్య సేవలపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా డిసెంబర్ నెలలో జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలకు రూ. 1.3 కోట్లు విలువ గలిగిన మందులను అందుబాటులో ఉంచినట్లు అమె తెలిపారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం

కడప అగ్రికల్చర్: ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏపీ జీఈఏ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎం.ఎ. ప్రసాద్ గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భాగ్య ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సుమర్, నజీర్, శ్రీనివాసులు, కార్యదర్శిగా గిరిధర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జిగాని బాష, మహిళా విభాగం కార్యదర్శిగా భువనేశ్వరి, కోశాధికారిగా మహేశ్వర రెడ్డి, డీఈసీ మెంబర్స్‌గా ప్రత్యూష , విజయ, రాష్ట్ర ఈసీ మెంబర్ గా మహబూబ్ రహమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన నాయకత్వానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సురేంద్రనాథ్, జిల్లా మాజీ అధ్యక్షులు బి.వి.వి.ఫణీంద్ర, పుల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మహేష్, శ్రీహరి, రాజశేఖర్, వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ ఎన్నికలలో ఎన్నికల అధికారిగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామ నాయుడు, పరిశీలకుడిగా రాష్ట్ర కోశాధికారి డి. శ్రీహరి వ్యవహరించారు.

అసలేం జరిగింది?

ఉన్నతాధికారుల ఆరా..
- 'వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అక్కడ పని చేసే సిబ్బంది బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా అనర్హులకు ఉద్యోగాలు కల్పించారనే అంశంపై సాక్షిలో శుక్రవారం 'వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు స్పందించారు. సమాచారం మేరకు కథనంలో వచ్చిన అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ అధికారులు సైతం ఈ అంశంపై దృష్టి సారించారు. ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉద్యోగుల వివరాలను వాకబు చేశారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి...

ఈ శాఖలో అవినీతి అక్రమాలపై పలు దశల్లో పెద్ద ఎత్తునే ఆరోపణలు వచ్చాయి. అక్కడ పనిచేసే కొంత మంది ఉద్యోగుల వైఖరిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం తరచూ వెలుగు చూస్తూనే ఉంది. అయితే బోగస్ సర్టిఫికెట్స్ నిర్ధారణకు అధికారులు సంబంధిత యూనివర్శిటీకి పంపడం..అక్కడి నుంచి వచ్చే నివేదిక ప్రకారం ఉద్యోగంలో ఉంచడమా లేక తొలగించడమా ఏదో ఒకటి చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అసలు దొంగలు..వాస్తవాలు మరుగున పడిపోతున్నాయి. అసలు బోగస్ సర్టిఫికెట్స్‌ను ఎవరు తయారు చేస్తున్నారు. అనర్హులకు ఉద్యోగాలు వచ్చేలా వ్యవహారంను ఎలా నడుపుతున్నారు. ఇదంతా చేస్తోంది ఇంటి దొంగలా లేదా బయట ఏదైనా ముఠా ఉందా అనే అంశాలపై ఎందుకు దృష్టి సారించడం లేదు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బోగస్ సర్టిఫికెట్స్ అంశం వచ్చిందంటే చాలు అధికారులు మొదట చెప్పే మాట యూనివర్శిటీకి పంపిస్తాం ..చర్యలు తీసుకుంటాం అని. సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం చూడరెందుకని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను అక్కడే ఉంచడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగ ధర్మం పాటించాలి. అర్హులకు న్యాయం చేయాలి. అందుకోసం ప్రభుత్వం జీతాలు ఇస్తోంది. 'మేము నిజాయతీపరులం' అని సమర్థించుకుంటూ అడ్డదారుల్లో వెళ్లడం తగునా. నిస్పక్షపాతంగా విచారణ జరిపితే వచ్చిన ఆరోపణలు నిజమా లేక అబద్ధమా అనేది తేలుతుంది. ఆరోపణల్లో వాస్తవాలు లేవంటే నిర్దోషులుగా తేలుతారు, లేదంటే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, నిరుద్యోగులు అంటున్నారు.

సర్టిఫికెట్స్‌ను యూనివర్శిటీకి పంపాం

బోగస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన కొందరిపై ఆరోపణలు వచ్చాయి. నిర్ధారణ కోసం ఆయా యూనివర్శిటీలకు సర్టిఫికెట్స్ పంపామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. యూనివర్శిటీ నుంచి నివేదిక రాగానే సంబంధిత ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంటి వద్దకే కార్గో సేవలు



పార్శిల్‌ను బుక్ చేస్తున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ కార్గో పార్శిల్ సర్వీసు సేవలు నేరుగా ఇంటి వద్దకే అందిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన రెండు పార్శిళ్లను బుక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో కార్గో పార్శిల్ సేవలను ప్రజలకు చేరువగా తీసుకు వెళ్లేందుకు 2021 నవంబరు 9వ తేదీన డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రారంభించామన్నారు. ఈ సేవలపై ప్రచారం కోసం యేటా ఏపీఎస్ ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ మారు మాసోత్సవాలను ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్గో డోర్ డెలివరీ సేవలపై ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. జిల్లాలో కడపతోపాటు బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప డీఎం డిల్లీశ్వరరావు, ఏటీఎం జనార్దన్, ఆర్ఎంఈకే చంద్ర, డీఎంఈకే గురుప్రసాద్, కాంట్రాక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఇరువురికి జైలు

బద్వేలు అర్బన్ : బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో 2021లో నమోదైన ఓ హత్యాయత్నం కేసులో శుక్రవారం ఇద్దరు నిందితులకు బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి 30 నెలల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.11 వేలు చొప్పున జరిమానా విధించినట్లు అర్బన్ ఎస్ఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఓ స్థల వివాదంలో బాధితుడైన రమణారెడ్డిని మీసాల వెంకటయ్య, మీసాలశ్రీనివాసులు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై అప్పట్లో రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇద్దరిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ క్రమంలో బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ఇద్దరికి శిక్ష విధించారు. సదరు కేసులో సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి ముద్దాయిలకు శిక్ష పడే విధంగా కృషి చేసిన అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్, బద్వేలు కోర్టు ఏపీపీ కె.రవిచంద్ర, కోర్టు కానిస్టేబుల్ పి.నాగరాజులను ఉన్నతాధికారులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లి : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కురబలకోట మండలం జబ్బా వారి పల్లెకు చెందిన నరసింహులు భార్య పాపులమ్మ(40) కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపం చెంది ఇంటి వద్దనే, పెయింట్స్‌లో కలిపే టర్పెంట్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బి కొత్తకోట మండలం తంగా వారి పల్లెకు చెందిన ప్రకాష్ రెడ్డి భార్య సబిత (28) కడుపునొప్పి భరించలేక టమాట పంటకు వాడే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన వారి కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గుంతకల్ డివిజన్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా బాషా


బీఎం బాషా

రాజంపేట : గుంతకల్ రైల్వే డివిజన్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడిగా నందలూరు రైల్వేకేంద్రానికి చెందిన రచయిత, నంది అవార్డు గ్రహీత బద్వేలు మస్తాన్‌బాషా(బీఎంబాషా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం దక్షిణ మధ్యరైల్వే జోనల్ మజ్దూర్ యూనియన్ నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఇప్పటివరకు డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న కెఎస్ రాజు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో బీఎం బాషా నియమితులయ్యారు.1997లో ఆర్ఆర్‌బీ ద్వారా ఎఎల్‌పీగా చేరారు. ప్రస్తుతం ఈయన రేణిగుంట జంక్షన్‌లో లోకో పైలెట్‌గా పనిచేస్తున్నారు. నందలూరు రైల్వేకేంద్రంలోనే విద్యాభ్యాసంతో పాటు రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీగా కార్మికులకు అనేక సేవలందించారు. ఈయన డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నిక పట్ల నందలూరు మజ్దూర్ యూనియన్ నేతలు గోపి, విశ్వనాథ్‌లతో పాటు పలువురు యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చిరుతపులి దాడిలో మేక మృతి

ములకలచెరువు : చిరుతపులి దాడిలో మేక మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. మేకల కాపరి పి. నరసింహులు కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యంకు చెందిన పి. నరసింహులకు వంద వరకు మేకలు ఉన్నాయి. వీటిని ప్రతి రోజూ స్థానికంగా ఉన్న కనుగొండ అడవిలోకి మేపేందుకు తోలుకొని వెళ్తుంటాడు. గురువారం సాయంత్రం మేకలను ఇంటికి తోలుకొని వస్తుండగా చిరుతపులి ఒక మేకపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిందన్నాడు. తనతో ఉన్న కుక్కలు, అతను ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పులి వెళ్లిపోయినట్లు చెప్పాడు. పులి దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన మేకను అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. ఘటనపై వివరించామన్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి షబీన్ తన సిబ్బందితో పెద్దపాళ్యం చేరుకొని విచారించారు.

నిబంధనలు బేఖాతర్..!

- మద్యం దుకాణాలకు అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్
- మద్యం తాగడానికి వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు
- రూరల్‌లో యథేచ్ఛగా బెల్టు షాపులు
- తీవ్రంగా పరిగణించని ఎక్సైజ్ అధికారులు
- హెచ్చరికలకే పరిమితమైన జరిమానాలు, లైసెన్సుల రద్దు


ప్రొద్దుటూరులోని ఓ మద్యం షాపులో పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తున్న ప్రియులు

సాక్షి ప్రతినిధి, కడప : 'బద్వేల్‌లోని గౌరీసాయి వైన్ షాపు వద్ద శుక్రవారం మందు బాబుల వీరంగం చేశారు. నడిరోడ్డుపైనే బాహాబాహీకి దిగారు. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు రాళ్లు, కత్తితో దాడి చేసుకున్నారు. ఇద్దరికి గాయాలైయ్యాయి. మద్యం షాపులోనే మద్యం సేవించే అవకాశం కల్పిస్తుండడంతోనే గొడవ తెరపైకి వచ్చింది. ఈవ్యవహారం ప్రజల్ని భయాందోళనకు గురిచేసింది'.

'ప్రభుత్వ నిబంధనలు అమలు చేయండి. 10 గంటలకు తెరవాల్సిన మద్యం షాపులు ఉదయం 6గంటలకే తెరుస్తున్నారు. ప్రత్యేకంగా మద్యం సేవించేందుకు రూములు ఏర్పాటు చేశారు. దీనివల్ల బార్లు వ్యాపారం దెబ్బతింటోందని బార్ యజమానులు వాపోతున్నారు. ప్రభుత్వ మద్యం పాలసీని తూచ తప్పకుండా అమలు చేయండి. ఎక్సైజ్‌శాఖ అధికారులు నిబంధనలు అమలు చేయండి. మద్యం షాపుల యజమానులతో లోపాయికారి ఒప్పందాలు స్వస్తి పలకండి. ఉద్యోగులుగా మీ విధులు నిర్వర్తించండి'. ఇటీవల ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వ్యాఖ్యలివి.

పై రెండు అంశాలను పరిశీలిస్తే జిల్లాలో ఎక్సైజ్‌శాఖ డొల్లతనం తేటతెల్లమౌతోంది. మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మద్యం దుకాణాలను అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు (మద్యం సేవించడానికి) నిర్వహిస్తున్నారు. మరో వైపు మద్యం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. గ్రామాలలో 24/7 మద్యం అందుబాటులో ఉంటోంది. ప్రభుత్వ ప్రకటనలు ఆర్భాటాలకు మినహా అమలులో చిత్తశుద్ధి లోపించింది. ఎక్సైజ్, పోలీసు వ్యవస్థల అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు.

మద్యం పాలసీకి తూట్లు

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తరువాత జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాలు లాటరీ ద్వారా ప్రభుత్వం కేటాయించింది. బెల్టు షాపులు నిర్వహించకూడదని, మద్యం దుకాణానికి అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయవద్దని, షాపులను ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకే మద్యం విక్రయించాలని నిబంధనలు విధించింది. వీటిని అతిక్రమిస్తే భారీ జరిమానాతోపాటు లైసెన్సును సైతం రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఆయన హెచ్చరికలు అమలు కావడం లేదు. మద్యం వ్యాపారులు ఇవేమీ పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మద్యం దుకాణాల వెనుక లేదా సమీపంలో అనధికార పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కల్తీ మద్యం అమ్మకాలు సైతం తెరపైకి వస్తున్నాయి. మద్యం సేవించడానికి మందు బాబులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. టేబుళ్లు, కుర్చీలు వేసి వాటర్ ప్యాకెట్‌లు, తినుబండారాలను అందుబాటులో ఉంచుతున్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలే దర్పం

ఎక్సైజ్‌శాఖ అధికారుల పనితీరుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వ్యాఖ్యలు దర్పంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడంలో అధికారులు విఫలమైయ్యారని స్పష్టం చేశారు. లోపాయికారి ఒప్పందాలు విస్మరించి నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనడానికి తాత్కారణంగా నిలుస్తోంది. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ నూతన మద్యం పాలసీ అమలు చేసేందుకు నడుం బిగించాలని పలువురు కోరుతున్నారు.

బద్వేలులో మందుబాబుల వీరంగం


గాయపడిన అక్రమ్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని గౌరిసాయి వైన్స్ ఎదుట శుక్రవారం మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో పఠాన్‌అక్రమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని దర్గావీధికి చెందిన అక్రమ్, జాఫర్‌లు వరుసకు అన్నదమ్ములు. ఇరువురు కలిసి మైదుకూరు రోడ్డులోని గౌరిసాయి వైన్స్‌లో మద్యం సేవించేందుకు వెళ్లారు. మద్యం సేవించిన అనంతరం అప్పటికే అక్కడ మద్యం సేవిస్తున్న సుమన్‌ను జాఫర్ గుట్కా అడిగాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న సుమన్ స్నేహితులు వెకిలిగా మాట్లాడటంతో జాఫర్ వారిని మందలించాడు. దీంతో కోపోద్రిక్తులైన సుమన్, అతని స్నేహితులు జాఫర్‌పై దాడికి దిగారు. పక్కనే ఉన్న అతని సోదరుడు అక్రమ్ విడిపించేందుకు ప్రయత్నం చేయగా అతనిపై కూడా విచక్షణా రహితంగా దాడి చేసి వైన్‌షాపు బయట పైనాపిల్ విక్రయించే బండి వద్ద కత్తి తీసుకుని అక్రమ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో అక్రమ్ కంటి వద్ద తీవ్ర గాయమైంది. వెంటనే జాఫర్, అతని మరో స్నేహితుడు అక్రమ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్రమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్, మల్లికార్జున, కల్యాణ్, మరికొందరిపై అర్బన్ ఎస్ఐ రవి కుమార్ కేసు నమోదు చేశారు.

నైతిక విలువలుంటే రాజీనామా చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు

- స్వార్థంతో, ఆస్తులు కాపాడుకోవడానికే పార్టీ మారారు
- తల్లిపాలు తాగి రొమ్ముగుద్దడం దారుణం
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీలో చేరిన కార్పొరేటర్లకు ఏమాత్రం నైతిక విలువలున్నా వైఎస్సార్‌సీపీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, వి. రామక్రిష్ణారెడ్డి, బి. మరియలు, శ్రీరంజన్‌రెడ్డి,త్యాగరాజు, కార్పొరేటర్లు కె. బాబు, సానపురెడ్డి శివకోటిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎవరైనా తమ పార్టీకి రావాలంటే రాజీనామా చేసి రావాలని చెప్పారని, అందుకు విరుద్ధంగా కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకోవడం సరికాదన్నారు. టీడీపీకి రాష్ట్రంలో ఓ రూలు, జిల్లాల్లో మరో రూలు ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాటకే వారు విలువ ఇవ్వడం లేదని చెప్పారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన విధంగా ఆ కార్పొరేటర్లు తమ స్వలాభాల కోసం, తమ ఆస్తులను కాపాడుకోవడానికే పార్టీ మారారని ధ్వజమెత్తారు. ప్రజలు వారిని చూసి ఓట్లు వేయలేదని, వైఎస్ జగన్‌ను చూసే వారికి ఓట్లు వేశారని గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి తమ పార్టీలో చేరారని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో కడపలో రూ.1300కోట్లు ఖర్చు చేసి రహదారులు, పార్కులు, విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు. బుగ్గవంక బ్రిడ్జిలను ఆరునెలల్లో పూర్తి చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే మాధవి తన మాట నిలబెట్టుకోలేక పోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమల్లారెడ్డి, షఫీ, కంచుపాటి బాబు పాల్గొన్నారు.

బంగారు వ్యాపారులకు కుచ్చుటోపి

– రూ.60 లక్షల బంగారు, వెండితో మాయం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన వసీం జ్యువెలర్స్ యజమాని మహబూబ్‌బాషా రూ. 60 లక్షల విలువ చేసే బంగారు, వెండితో పరారయినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. అతను ఎప్పుడు ఊర్లో నుంచి మాయమయ్యాడో తెలియదుకానీ గురువారం ప్రొద్దుటూరు నుంచి బంగారు వ్యాపారస్తులు పోరుమామిళ్లకు వచ్చి ఎస్ఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేయడంతో సమాచారం వెలుగు చూసింది. శుక్రవారం ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌బాషా ప్రొద్దుటూరు బంగారు వ్యాపారుల వద్ద బంగారు, వెండి తెచ్చి ఇక్కడ అమ్ముకుని తెచ్చినచోట సొమ్ము చెల్లించేవాడు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరుతో పాటు చాగలమర్రి, బద్వేలు, మైదుకూరు ప్రాంతాల్లోని 12 మంది వద్ద నగలు తెచ్చి పోరుమామిళ్లలో అమ్మి కొంత కొంత మొత్తం అప్పు ఇచ్చిన వారికి చెల్లించేవాడు. ఇటీవల ప్రొద్దుటూరు వ్యాపారులకు జమ ఇవ్వకపోవడం, ఫోన్‌లో సమాధానం లేకపోవడంతో వారికి అనుమానం వచ్చి ఇక్కడకు వచ్చారు. మహబూబ్‌బాషా నెల నుండే ఓ ప్లాన్ ప్రకారం అందరి వద్ద రూ. 60 లక్షల బంగారు, వెండి తీసుకుని, జమ ఇవ్వకుండా భార్య హర్షత్ ఉన్నీసాతో పరారైనట్లు తెలుస్తోంది. ఇదంతా పక్కా ప్లాన్‌తోనే మోసం చేసినట్లు వ్యాపారులు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా బంగారు షాపు యజమాని మహబూబ్‌బాషా పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

అంబేడ్కర్‌కు, రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకం

- రాజ్యాంగం స్థానలో మనుస్మృతిని తెచ్చేందుకు కుట్రలు
- అందులో భాగంగానే అమిత్ షా వ్యాఖ్యలు
- దళిత ఫోరం చైర్మన్ బూసిపాటి కిషోర్ కుమార్



కడప కార్పొరేషన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ..ఆయన ఐడియాలజీకి, రాజ్యాంగానికి మొదటి నుంచి బీజేపీ వ్యతిరేకమని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి ఆరోపించారు. పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడారని ధ్వజమెత్తారు. శుక్రవారం కడప నగరంలోని దళిత ఫోరం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు దైవంగా పూజించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించడం దారుణమన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు ఆ పార్టీ అహంకారానికి నిదర్శనమన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి ఆ స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు సంఘ పరివార్‌తో కలిసి బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూడా 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ చెప్పడం కూడా ఇందుకు నిదర్శనమన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో ఎన్నికలకు సిద్ధమవుతున్న బీజేపీ దళిత వర్గాల్లో చీలిక తెచ్చేందుకు కుట్ర పన్నుతోందన్నారు. దళితులను చీల్చడమే కాకుండా... ఏకంగా అంబేడ్కర్‌పై అవమానకర రీతిలో మాట్లాడడం దుర్మార్గమైన చర్య అన్నారు.

దళిత సంక్షేమ పథకాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళితుల సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిలిపివేసిన 27 దళిత సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కావస్తున్నా బడ్జెట్లో దళితులకు నిధుల కేటాయింపులు ఏమాత్రం చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం దళిత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అలాగే ఈ భారతదేశ రాజ్యాంగం రూపకల్పన మంత్రాలతో ప్రార్ధనలతో, విశ్వాసాలతో, నమ్మకాలతో, రూపొందించిన రాజ్యాంగం కాదన్నారు. ఈ దేశంలో అణగారిన వర్గాలకు ఆర్థిక సామాజిక సమానత్వం స్వాతంత్రం కోసం రాజ్యాంగంలో హక్కులు అవకాశాలు ఏర్పరచడం జరిగిందన్నారు. మేధావి అంబేడ్కర్ పేరును రాజ్యసభలో గౌరవ సభ్యులు తలుచుకుంటే మనువాది అమిత్‌షా మతోన్మాద పిచ్చితో మాట్లాడడం ఈ దేశ పౌరుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌ను అవమానించడమే అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించి వెంటనే ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగ దాసరి ఇమ్మానియేల్, కానగల మునెయ్య జిల్లా నాయకులు పడిగ వెంకటరమణ, నాగేశ్వరరావు, పెంచలయ్య, ప్రసాద్, చంద్రగుప్త, ఏసురత్నం. గోవిందు తదితర నాయకులు పాల్గొన్నారు

హత్యకేసులో వీడిన మిస్టరీ

- హత్యకు వినియోగించిన వస్తువులు స్వాధీనం
- నిందితులు కడప సెంట్రల్ జైలుకు తరలింపు


కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ మహమ్మద్ రఫీ

కొండాపురం : మండలంలో ఇటీవల జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా.. మండల పరిధిలోని లావనూరు గ్రామ సమీపంలో వెంకయ్యకాలువ రోడ్డులోని నల్లవంక వంతెన వద్ద ఈనెల 17న తెల్లవారుజామున యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లోబన్నగారి సురేష్(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి భార్య సి. వీరకుమారి అదే గ్రామానికి చెందిన గజ్జప్పగారి బాబుతో వివాహేతర సంబంధం పెట్టుకొని ఉందని సురేష్ తన భార్యను మందలించాడు. దీంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. సురేష్ బతికుంటే మనకి అడ్డువస్తాడని ఎలాగైనా చంపాలని ప్రియుడు బాబుతో కలిసి కుట్రపన్నారు. బాబు స్నేహితులు వెలిదండ్ల సుభాన్ అలియాజ్ సుబ్బు, చుక్కలూరు కిరణ్‌కుమార్‌యాదవ్‌లకు విషయం చెప్పి సుబ్బుకు రూ.1లక్ష, కిరణ్‌కుమార్‌కు రూ. 50 వేల ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల16వ తేదీన బాబు, సుబ్బు, కిరణ్ కలసి సుబహాన్ బర్త్‌డే పార్టీ రైల్వే కొండాపురం గ్రామంలో ఉందని సురేష్‌కు చెప్పి బొలెరో వాహనంలో ఎక్కించుకొని లావనూరు గ్రామం దగ్గర ఉన్న నల్లవంక బ్రిడ్జి దగ్గరకు తీసుకెళ్లారు. సురేష్‌కు అతిగా మద్యం తాపించి స్పృహ కోల్పోయిన సమయంలో నల్లని తాడుతో గొంతుకు బిగించి హత్య చేశారు. శవాన్ని నల్లవంక బ్రిడ్జి పైనే వదిలేసి ఎవరికి అనుమానం రాకుండా తాగిన మద్యం బాటిళ్ల వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు అక్కడే ఉంచినట్లు సీఐ తెలిపారు. 19వ తేదీన కె.సుగుమంచిపల్లె వీఆర్వో పెద్దన్న వద్దకు వెళ్లి మేం ముగ్గురం కలసి సురేష్‌ను నల్లవంక బ్రిడ్జిపై హత్య చేసి అక్కడే పడివేసినట్లు చెప్పారు. వీఆర్‌ఓ పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. హత్యకు వినియోగించిన వాహనం, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.అనంతరం వారిని కడప సెంట్రల్ జైలు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ విద్యాసాగర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


వెంకట హిమవంతు


జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన వెంకట హిమవంతు అనే విద్యార్థి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి అదృశ్యం కావడంతో తండ్రి మురళి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రామక్రిష్ణ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన వెంకట హిమవంతు జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె రహదారిలో నున్న జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కాగా ఈ నెల 18న రాత్రి 10 గంటల సమయంలో తన పక్క రూంలో ఉన్నటువంటి మునిశివ అనే విద్యార్థితో గొడవపడ్డాడు. ఈ విషయమై వాచ్‌మెన్ ఇరువురిని పిలిచి మందలించాడు. గొడవ జరిగిన విషయాన్ని వాచ్‌మెన్ తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. 19వ తేదీ ఉదయం పరీక్ష రాసిన అనంతరం మధ్యాహ్నం సమయంలో వెంకట హిమవంతు పాఠశాల ప్రహరీ దూకి పారిపోయాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ కెవిఎస్ రామకృష్ణారెడ్డి విద్యార్థి తల్లిదండ్రులతో కలసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాహుల్ గాంధీపై కేసు దుర్మార్గం


మాట్లాడుతున్న బండి జకరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పార్లమెంటు ప్రాంగణంలో అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో జరిగిన తోపులాటలో బాధ్యుడిని చేస్తూ రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం దుర్మార్గమని కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య తప్పు పట్టారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఎన్డీఏ ఇండియా ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగారన్నారు. ఆ సమయంలో మకర ద్వారం వద్ద అధికారపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ సభ్యులు కర్రలతో కూడిన ప్లకార్డును పట్టుకొని ఆ కర్రలతో కాంగ్రెస్ ఎంపీల మీద దాడి చేసి పార్లమెంట్ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. దీనికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ వీడియో కూడా విడుదల చేసిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే బీజేపీ ఎంపీలు దౌర్జన్యం చేయడం సరి కాదని, తక్షణమే రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. సమావేశంలో ఏఐసీసీ సమన్వయకర్త అబ్దుల్ సత్తార్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.

వివేకా పీఏ ప్రైవేట్ కేసుపై వైఎస్ మనోహర్‌రెడ్డిని విచారించిన డీఎస్పీ


విచారణకు వస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన పీఏ వెంకటకృష్ణారెడ్డి ప్రైవేట్ కేసుపై పోలీసులు శుక్రవారం పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డిని, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డిని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళి నాయక్ విచారించారు. అప్పటి సీబీఐ అధికారి రాంసింగ్ బెదిరిస్తున్నారని పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. గత ఏడాది డిసెంబర్ 15 మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె సునీత అల్లుడు రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌లపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వారిపై పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తి విచారణ చేయాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ఆదేశించడంతో మళ్లీ దర్యాప్తును ప్రారంభించారు. అందులో భాగంగా భాగంగా పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డిలను విచారించినట్లు డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు

విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి

గాలివీడు : విద్యుత్ తీగలు తగిలి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలోని చోటు చేసుకుంది. పెద్దూరుకు చెందిన రియాజ్ అహమ్మద్‌కు చెందిన పాడి ఆవు శుక్రవారం మేతకు వెళ్లిన క్రమంలో పెద్దూరు పక్కనే వరిమళ్ళలో ఉరుసు జరిగే ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ తీగలు డిస్క్ కట్ అయిన కారణంగా కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదవశాత్తు పాడి ఆవుకు తీగ తగిలి మృతి చెందినట్లు సమాచారం. మరో 20 రోజుల్లో పాడి ఆవు ప్రసవించాల్సి ఉండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ తీగల ధాటికి పాడి ఆవు విగత జీవులై పడివుండటం చూపరుల హృదయాన్ని కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేరళ ట్రెక్కింగ్‌కు ఎన్‌సీసీ విద్యార్థి

చిట్వేలి : ఆల్ ఇండియా కేరళ ట్రెక్కింగ్‌కు చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ విద్యార్థి పులి దిలీప్ కుమార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏబిఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేది వరకు కెడెట్ దిలీప్ కుమార్ జాతీయస్థాయిలో కేరళలో జరిగే ట్రెక్కింగ్‌లో పాల్గొంటారన్నారు.

పుల్లంపేటలో ఐదుగురు స్మగ్లర్లు అరెస్టు

- 15 ఎర్రచందనం దుంగలు పట్టివేత
- రెండు బైకులు స్వాధీనం


ఎర్రచందనం స్మగర్ల అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్

రాజంపేట : పుల్లంపేట పోలీసుస్టేషన్ పరిధిలో అనంతసముద్రం పంచాయతీ బోటుమీదపల్లెకు చెందిన ఐదుమంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం రూరల్ సీఐ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో బోటుమీదపల్లె గ్రామానికి ఉత్తరంవైపు ఉన్న ఊరుగట్టు వద్ద సాలన గంగయ్య(బోటుమీదపల్లె), అక్కని నరసింహులు(బోటుమీదపల్లె), బొర్సు సుబ్బరాయుడు(బోయనపల్లె, రాజంపేట), చల్లా వెంకటస్వామి(కడప, శ్రీరాంనగర్), నక్క చిన్న వెంకటసుబ్బయ్య(నాగసానిపల్లె, ఖాజీపేట మండలం) ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.4,31,200 విలువ చేసే 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.80వేలు విలువ చేసే రెండు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టుకు హాజరపరచగా రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు. స్మగ్లర్లను పట్టుకోవడంలో రూరల్ సీఐ బీవీరమణ, పుల్లంపేట, నందలూరు ఎస్ఐలు, రెడ్‌శ్యాండల్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ వారి సిబ్బంది, ఎఫ్‌బీఓలు ప్రధాన పాత్ర పోషించారన్నారు.